క్లుప్తంగా...

అవార్డు ప్రదానం



విజ్ఞతకు అవార్డు ప్రదానం చేస్తున్న న్యాయమూర్తి

చార్మినార్: డాక్టర్ అబ్దుల్ కలాం చూపిన బాటలో నడవాలని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి పీఎస్ నంద అన్నారు. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో పాతబస్తీకి చెందిన విద్యావేత్త జక్కుల విజ్ఞతకు డాక్టర్ అబ్దుల్ కలాం స్మారక అవార్డు–2023ను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్, సంఘసేవకులు కాశమోనీ శ్యాంరావు ముదిరాజ్ పాల్గొన్నారు.

కరాటేతో స్వీయరక్షణ

చాంద్రాయణగుట్ట: విద్యార్థి దశ నుంచే కరాటే నేర్చుకోవడం స్వీయరక్షణకు దోహదపడుతుందని నాయక్ బూడోఖాన్ కరాటే అకాడమీ మాస్టర్ పి.గణేష్‌నాయక్ అన్నారు. రాజన్నబావి శివాజీనగర్ సెయింట్ మేరీస్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు కరాటేలో రిఫరీ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మాస్టర్ గణేష్, బూడోఖాన్ సీనియర్ రిఫరీ శివప్రసాద్ రాజులు విద్యార్థులకు పలు మెళకువలను నేర్పించారు. టీకేఐ గ్రాండ్ మాస్టర్ సి.హనుమంత రావును చూసి విద్యార్థులు ప్రేరణ పొందాలని సూచించారు. అనంతరం మాస్టర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఝాన్సీరాణి పాల్గొన్నారు.

ముగిసిన నర్సింహా యాదవ్ అంత్యక్రియలు



అబిడ్స్: మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ మామయ్య మజ్జిగ నర్సింహాయాదవ్ అంత్యక్రియలు సోమవారం జరిగాయి. గోషామహల్ దారుసలాం ప్రాంతంలో నివసించే మజ్జిగ నర్సింహాయాదవ్ ఆదివారం తుదిశ్వాస విడిచారు. సోమవారం జరిగిన అంత్యక్రియల్లో మంత్రి తలసాని ముందుండి కొనసాగించారు.

దారుషిఫాలో తెల్ల కర్ర దినోత్సవం



దబీర్‌పురా: దారుషిఫాలోని స్కూల్‌లో వైట్ కెనీ డే (తెల్ల కర్ర దినోత్సవం)ను నిర్వహించారు. ఈ సందర్భంగా విసువల్లీ చాలెంజ్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంధులు బ్యానర్‌ను ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంధులు మాట్లాడుతూ..బదిలీలు, పదోన్నతులలో అంధ ఉద్యోగులకు 100 శాతం ప్రాధాన్యత కల్పించి అంధ ఉద్యోగులు కోరుకుంటే తప్పా బదిలీ చేయకూడదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మహ్మద్ షరీఫ్ పాల్గొన్నారు.

సన్మానం



అబిడ్స్: వాణిజ్య పన్నుల శాఖ నూతన కమిషనర్ క్రిష్టినా చొంగ్తును సన్మానించారు. పదవీబాధ్యతలు స్వీకరించిన ఆమెకు తెలంగాణ వాణిజ్య పన్నుల శాఖ కార్యవర్గం అధ్యక్షుడు ప్రదీప్‌కుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మహ్మద్ రహ్మత్ అలీ, కోశాధికారి దేవులపల్లి శ్రీనివాస్‌రావు, అసోసియేట్ అధ్యక్షులు హరిప్రసాద్, కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీరామ్‌కుమార్ పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఉద్యోగుల సమస్యలు వేగవంతంగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.



మహంకాళి ఆలయంలో..



గుడిమల్కాపూర్ జైదుర్గ ఆలయంలో పల్లకీ సేవా



ఇస్సామియాబజార్‌లో నెలకొల్పిన 55 అడుగుల అమ్మవారి విగ్రహం



బేగంబజార్‌లో..



మీరాలంమండిలో బాలత్రిపుర సుందరీ దేవీగా

భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రి ఉత్సవాలు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజైన సోమవారం అమ్మవారు బాలత్రిపుర సుందరీ దేవీ అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

– అబిడ్స్, చార్మినార్, మెహదీపట్నం జోన్ల బృందం



గాయత్రీదేవి అవతారంలో జమ్మిచెట్టు దుర్గామాత



దూద్‌బౌలీ సీతల్‌మాతా ఆలయంలో..



వేడుకల్లో బీఆర్ఎస్ నాయకుడు ఆశీష్‌కుమార్ యాదవ్

రామాయణ్ మేళా వేడుకలు ప్రారంభం

అబిడ్స్: రాజస్థానీ ప్రగతి సమాజ్, ఎగ్జిబిషన్ సొసైటీ ఎకనామిక్ కమిటీ ఆధ్వర్యంలో రామాయణ్ మేళా వేడుకలు ప్రారంభించారు. 51వ రామాయణ్‌మేళా వేడుకలు ఎగ్జిబిషన్‌లో ఘటాల స్థాపన పూజలు చేసి వేడుకలు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా చీఫ్ కన్వీనర్ గోవింద్‌రాఠి, ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు వనం సత్తేందర్, కార్యదర్శి హన్మంతరావు మాట్లాడుతూ..ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం రామాయణ్ మేళా వేడుకలు పెద్ద ఎత్తున చేపడుతున్నట్లు తెలిపారు. వేడుకల్లో భాగంగా గర్బా దాండియా ఉత్సవాలు ఈనెల 18వ తేదీ నుంచి ప్రారంభిస్తామన్నారు. 24న రావణ దహనం శమిపూజ, ఇతర కార్యక్రమాలు ఉంటాయన్నారు.



వేడుకల్లో గోవింద్‌రాఠి, వనం సత్తేందర్, హన్మంతరావు తదితరులు

ఈ కార్యక్రమంలో కోశాధికారి ఛరణ్‌జిత్ సింగ్, ఎకానామిక్ కమిటీ ఉపాధ్యక్షుడు ఆదిత్యమార్గం కన్వీనర్ వినయ్‌కుమార్ ముదిరాజ్, గిరిధర్‌లాల్ దాగా, మనోజ్ జైస్వాల్, నందుగోపాల్ భరత్, కమల్‌రాఠి, సుమిత్‌రాఠి పాల్గొన్నారు.

చాంద్రాయణగుట్ట అభ్యర్థిని మార్చాలి



పర్వతాల రాజేందర్

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్ట నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థిగా ఎలాంటి అనుభవం లేని వ్యక్తిని ప్రకటించడం సరైంది కాదని టీపీసీసీ కార్యనిర్వాహక కార్యదర్శి, సీటు ఆశావహుడు పర్వతాల రాజేందర్ అన్నారు. 36 ఏళ్ల నుంచి పార్టీ కోసం జీవితాన్ని ఫణంగా పెట్టిన తనకు టికెట్ ఇవ్వాలని కోరుతూ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్‌కు సోమవారం ఆయన వేర్వేరుగా రిజిష్టర్ పోస్ట్ చేశారు. పార్టీని బలోపేతం చేసేందుకు తాను చేసిన సేవలను గుర్తించాలన్నారు.

సీపీఆర్‌తో ప్రాణాలను కాపాడవచ్చు

అఫ్జల్‌గంజ్: గుండెపోటు వచ్చిన వ్యక్తులకు సీపీఆర్ చేయడం వల్ల ప్రాణాపాయం నుంచి కాపాడవచ్చని ఉస్మానియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్ అన్నారు. సోమవారం ఉస్మానియా అనస్థీషియా విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ అనస్థీషియా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేందర్ మాట్లాడుతూ.. హఠాత్తుగా గుండెపోటు వచ్చిన వ్యక్తికి సత్వరమే సీపీఆర్ చేయడంతో పాటు అంబులెన్స్‌కు సమాచారం అందించాలని సూచించారు. ఉస్మానియా అనస్థీషియా విభాగాధిపతి డాక్టర్ పాండూ నాయక్ మాట్లాడుతూ.. ఆపత్కాలంలో హృద్రోగులకు సీపీఆర్ చేయడం వల్ల మరణాల రేటును తగ్గించవచ్చని, ఈ విషయమై వైద్య సిబ్బందితో పాటు సాధారణ ప్రజానీకం అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు సూపరింటెండెంట్ డాక్టర్ త్రివేణి, ఆర్‌ఎంఓలు, అనస్థీషియా వైద్యులు వెంకటేశ్వర్లు, రామకృష్ణారెడ్డి, కీర్తన వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అనస్థీషియా విభాగం వైద్యులు

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



సంతోష్‌నగర్: ఎన్నికల సందర్భంగా రౌడీషీటర్లు ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకూడదని సంతోష్‌నగర్ ఏసీపీ మహ్మద్ సూచించారు. బన్నాకాలోని సంతోష్‌నగర్ డివిజన్ ఏసీపీ కార్యాలయంలో సోమవారం ఆయన డివిజన్ పరిధిలోని 36 మంది రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రానున్న ఎన్నికల సందర్భంగా రౌడీషీటర్లు ఎలాంటి నేరాలకు పాల్పడకుండా దూరంగా ఉంటూ సమాజంలో మంచి వ్యక్తులుగా కొనసాగాలన్నారు. ఒకవేళ ఎన్నికల సమయంలో నేరాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సంతోష్‌నగర్ ఇన్‌స్పెక్టర్ పూసపాటి శివచంద్ర, డీఐ జగన్‌రెడ్డి, ఎస్సై వెంకటేశ్, ఐ.ఎస్.సదన్ ఇన్‌స్పెక్టర్ ఎస్.మల్లేష్ పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్త చిత్తశుద్ధితో పని చేయాలి

గోల్కొండ: కాంగ్రెస్ అభ్యర్థుల విజయం కోసం ప్రతి కార్యకర్త చిత్తశుద్ధితో పని చేయాలని కాంగ్రెస్ పరిశీలకుడు మంజూర్‌అలీ అన్నారు. కార్వాన్ కాంగ్రెస్ టికెట్ అర్హులైన వారికి అందించాలంటూ పలువురు ఆశావాహులు సోమవారం ఆయనను కలిశారు. కాంగ్రెస్ పార్టీ కోసం దశాబ్దాలుగా పని చేస్తున్న వారిని కాకుండా కాంగ్రెస్ పార్టీ కోసం ఏమాత్రం పని చేయని వ్యక్తికి ఈసారి కార్వాన్ టికెట్ కేటాయించడం జరిగిందని పలువురు టికెట్ ఆశిస్తున్న వారు ఆయనకు వివరించారు. కార్వాన్ కాంగ్రెస్ టికెట్ కేటాయింపు విషయం తన దృష్టికి రాలేదని అభ్యర్థి ఎంపికపై అభ్యంత్రాలను పరిశీలిస్తామని ఆయన అన్నారు. సమన్వయంగా ఉంటూ పార్టీ అభ్యర్థి విజయం కోసం పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. కురాకుల కృష్ణ, అఫ్సర్ యూసుఫ్‌జాహీ, నర్సింహులు, రాములు, చంటి బాబు, కార్వాన్ నియోజకవర్గానికి చెందిన డివిజన్ నాయకులు తదితరులున్నారు.



మంజూర్ అలీ, హన్మంతరావుతో కార్వాన్ కాంగ్రెస్ నాయకులు

బరాత్‌లో కత్తితో డ్యాన్స్ చేసిన వ్యక్తికి జైలు

గౌలిపురా: బరాత్‌లో కత్తితో డ్యాన్స్ చేసూ న్యూసెన్స్ చేస్తున్న ఓ వ్యక్తిపై నాంపల్లిలోని 4వ స్పెషల్ మెట్రో పాలిటన్ కోర్టు మెజిస్ట్రేట్ లలిత 2 రోజుల జైలు శిక్ష, రూ.300ల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ఇన్‌స్పెక్టర్ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. భవానీనగర్ తలాబ్‌కట్టా ప్రాంతానికి చెందిన షేక్ సమీర్ (24) బరాత్‌లో కత్తితో డ్యాన్స్ చేస్తూ స్థానికంగా న్యూసెన్స్ చేస్తున్నాడు. దీనిపై భవానీనగర్ పోలీసులు నిందితునిపై కేసు నమోదు చేసుకొని సోమవారం నాంపల్లిలోని 4వ స్పెషల్ మెట్రో పాలిటన్ కోర్టులో హాజరుపరచగా.. పూర్వ పరాలను పరిశీలించిన మెజిస్ట్రేట్ లలిత నిందితుడు సమీర్‌కు 2 రోజుల జైలు శిక్ష, రూ.300ల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

పాతబస్తీలో మజ్లిస్ పార్టీ సిట్టింగ్‌లకు షాక్?

- అభ్యర్థుల మార్పులపై ఊహాగానాలు
- మార్పులుండొచ్చంటూ ఇప్పటికే ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ వెల్లడి
- అభ్యర్థి ఎవరైనా పార్టీ జెండాపై విజయం ఖాయం: మజ్లిస్

చార్మినార్: పాతబస్తీలోని నాలుగు నియోజకవర్గాలకు ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీ తమ అభ్యర్థు లను ప్రకటించగా.. ఆదివారం కాంగ్రెస్ పార్టీ కూడా తమ అభ్యర్థులను ప్రకటించింది. ఇక బీజేపీ, మజ్లిస్ పార్టీ తమ అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. ఇక మజ్లిస్ పార్టీ విషయానికి వస్తే.. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని గోషామహల్ శాసనసభ నియోజకవర్గం తప్పా.. మిగిలిన ఆరు శాసనసభ నియోజకవర్గాలు మజ్లిస్ పార్టీకి కంచుకోటగా ఉన్నాయి.

- ఈసారి జరిగే ఎన్నికల్లో హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ఏడు స్థానాలలో గోషామహల్ నియోజకవర్గం తప్పా.. మిగిలిన ఆరు నియోజకవర్గాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలకు షాక్ తగలనున్నట్లు తెలుస్తోంది.
- మజ్లిస్ పార్టీ సిట్టింగ్ అభ్యర్థుల నియోజకవర్గాల మార్పు ఉంటుందని ఇప్పటికే ఒకానొక సందర్భంలో ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ స్పష్టం చేశారు.
- అభ్యర్థుల ఎంపిక తన చేతుల్లో లేదని.. అంతా అల్లా చూసుకుంటాడని ఆయన అన్నారు.
- అసదుద్దీన్ ఒవైసీ స్వయంగా అభ్యర్థుల మార్పు ఉంటుందని చెప్పడంతో పలువురు సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఆలోచనలో పడ్డారు.
- నియోజకవర్గం మారితే ఫర్వాలేదని.. మొత్తానికే టికెట్ లభించక పోతే ఎలా..? అంటూ ఇప్పటి నుంచే ఆందోళనకు గురవుతున్నారు.

'కార్వాన్‌లో భారీ మెజార్టీతో గెలుస్తాం'

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గం నుంచి భారీ మెజార్టీతో గెలుస్తానని బీఆర్ఎస్ కార్వాన్ నియోజకవర్గ అభ్యర్థి మిత్ర కృష్ణ అన్నారు. డివిజన్ ఎన్నికల కమిటీలు వేయడానికి సోమవారం గుడిమల్కాపూర్‌లో ఆయన ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలోని ఇతర రాష్ట్రాల ప్రభుత్వాలు ఎంతో ఆసక్తిగా గమనిస్తున్నాయని అన్నారు. ఈ సంక్షేమ పథకాల వల్లే ప్రజలు బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఆదరిస్తున్నారన్నారు. కాంగ్రెస్ గడువు తీరిన పార్టీ అని ఆ పార్టీ ఉనికిని కాపాడుకోవడం కోసం పోటీ చేస్తున్నదని ఆయన అన్నారు. అదే విధంగా అటువైపు బీజేపీ కూడా రాష్ట్రంలో గెలువలేని పరిస్థితుల్లో ఉందని ఆ పార్టీకి నాయకులే కరువైయ్యారని ఆయన పేర్కొన్నారు. వచ్చే ఆదివారం కార్వాన్ మోహిని ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గ సీనియర్ నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నామని ఇందులో బీఆర్ఎస్ డివిజన్ కమిటీలను వేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బీఆర్ఎస్ నాయకులు తూంకుంట అరుణ్‌కుమార్‌తో పాటు మంజుల, జ్యోతి, పాశం మంగ, సి.జ్యోతి రాజ్, రేణుకయాదవ్ తదితరులున్నారు.



నాయకులతో బీఆర్ఎస్ అభ్యర్థి మిత్ర కృష్ణ

'రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే'

గోల్కొండ: తెలంగాణలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే అన్నారు. కార్వాన్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా కార్వాన్‌లో పని చేసే నాయకులకు కాకుండా గతంలో ఇతర పార్టీలకు పని చేసిన వారికి టికెట్ కేటాయించారని ఈ సందర్భంగా వారు ఆయనకు ఫిర్యాదు చేశారు. కార్వాన్ కాంగ్రెస్ ఇన్‌చార్జీగా ఉండి కనీసం డివిజన్ కమిటీలను కూడా వేయడం చేతకాని అభ్యర్థికి టికెట్ ఇచ్చారని కాంగ్రెస్ నాయకులు ఆయనకు వివరించారు. ఏదేమైనా అర్హులైన వారికే టికెట్ ఇవ్వాలని వారు ఆయనను కోరారు. ఈ సందర్భంగా ఠాక్రే మాట్లాడుతూ.. కార్వాన్ టికెట్ ఉస్మాన్ బిన్ మహ్మద్ అల్‌హాజరీకి ఇవ్వడం జరిగిందని అయితే కాంగ్రెస్ కార్వాన్ నాయకుల నుంచి వస్తున్న వ్యతిరేకతను పరిశీలిస్తామన్నారు. అన్ని వివరాలు తెలుసుకున్న తర్వాతే బీఫామ్ ఇవ్వడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఆయనను కలిసిన వారిలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కురాకుల కృష్ణ, ముంగి జైపాల్‌రెడ్డి, చంద్రశేఖర్, రవీందర్, రాములు, చంటి బాబు తదితరులున్నారు.



కార్వాన్ కాంగ్రెస్ నాయకులతో తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జి మాణిక్‌రావుఠాక్రే

మజ్లిస్‌లో మహిళలకు ప్రాధాన్యం

గోల్కొండ: మజ్లిస్ పార్టీ మహిళలకు ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన గుడిమల్కాపూర్, కార్వాన్ డివిజన్లలోని న్యూ సత్యనారాయణనగర్, టెలికాం నగర్, తుల్జాభవానీనగర్, తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా తుల్జాభవానీనగర్‌లో స్థానిక మహిళలు ఆయనను కలిశారు. తమ బస్తీల్లో అన్ని రకాల పనులు చేసినందుకు ఎమ్మెల్యేను వారు అభినందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పని చేసే వారికి తమ పార్టీ ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. ముఖ్యంగా పార్టీలో మహిళలకు సముచిత స్థానం కల్పించడం జరుగుతుందని ఆయన అన్నారు. మజ్లిస్ పనితీరును చూసిన వారు మజ్లిస్‌కు ఓటు వేస్తారని గత ఎన్నికల ఫలితాల్లో తన గెలుపు వెనుక మహిళలు ఉన్నారని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం మహిళల కోసం ఎన్నో ఉపాధి పథకాలు ప్రారంభించడం జరిగిందని దీని ద్వారా చదువుకున్న ఎందరో యువతులు తమ కుటుంబాలను పోషించుకుంటూ ఆర్థికంగా ఎదిగాయని ఆయన అన్నారు.



వివిధ బస్తీల మహిళలతో కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్

గోషామహల్‌లో 24 గంటల పాటు ప్రత్యేక తనిఖీలు

అబిడ్స్: ఎన్నికల నిబంధనలు అందరూ పాటించే విధంగా గోషామహల్ నియోజకవర్గం నలుమూలలా 24 గంటల పాటు పోలీస్ ఫ్లైయింగ్ స్క్వాడ్‌ల సిబ్బందితో ముమ్మర తనిఖీలు చేపడుతున్నట్లు నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి వి.విక్టర్ పేర్కొన్నారు. సోమవారం అబిడ్స్ మున్సిపల్ కాంప్లెక్స్‌లోని ఆర్.ఓ కార్యాలయంలో ఫ్లైయింగ్ స్క్వాడ్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విక్టర్ మాట్లాడుతూ.. నియోజకవర్గాన్ని మూడు భాగాలుగా విభజించామని తెలిపారు. పోలీస్ సిబ్బందితో కూడిన ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు ప్రత్యేక తనిఖీలు చేస్తాయన్నారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఒక బృందం, సాయంత్రం 6 నుంచి తెల్లవారి ఉదయం 6 గంటల వరకు మరో బృందం తనిఖీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. పోలీసులతో పాటు ఒక వీడియోగ్రాఫర్, మరికొంత మంది అధికారులు కూడా ఉంటారని వివరించారు. వాహనాల తనిఖీల్లో నగదు కానీ, బంగారం కానీ ఎవరిదగ్గరైనా దొరికితే వారి దగ్గర వివరాలు సరిగ్గా ఉంటే అక్కడికక్కడే వారికి ఇస్తామన్నారు. నియోజకవర్గంలో ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు నిరంతరం తనిఖీలు చేపట్టి ఎన్నికలు ప్రశాంతంగా జరిగేవిధంగా కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఏఆర్‌ఓలు, తహసీల్దార్ మన్నె ప్రేమ్ కుమార్, విద్యాసాగర్, శైలజ, కో ఆపరేటివ్ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఫ్లైయింగ్ స్క్వాడ్ సిబ్బందితో సమావేశం నిర్వహించిన రిటర్నింగ్ అధికారి విక్టర్

సీఆర్‌పీఎఫ్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

గోల్కొండ: బాలికల చదువు దేశానికి వెలుగు అని సీఆర్‌పీఎఫ్ డీఐజీ ఉదయ్‌భాస్కర్ బిల్లా అన్నారు. సోమవారం సీఆర్‌పీఎఫ్ మహిళా బైక్ ర్యాలీ యశశ్విని చంద్రాయణగుట్టలోని సీఆర్‌పీఎఫ్ క్యాంప్ నుంచి గోల్కొండ కోటకు చేరుకుంది. ఈ బైక్ ర్యాలీలో 60 మంది సీఆర్‌పీఎఫ్‌కు చెందిన మహిళలు పాల్గొన్నారు. గోల్కొండ కోట రాణిమహల్ బాగ్‌లో మహిళా బైకర్స్‌ను ఉద్దేశించి సీఆర్‌పీఎఫ్ డీఐజీ ఉదయ్‌భాస్కర్ బిల్లా మాట్లాడారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని ఏక్తా బైక్ ర్యాలీని నిర్వహిస్తున్నామని ఆయన అన్నారు. ఈనెల 5 నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ వివిధ రాష్ట్రాల గుండా గుజరాత్‌లోని ఉక్కుమనిషి స్టాచ్‌కు చేరుకుంటుందన్నారు. కేవలం మహిళా రైడర్స్ మాత్రమే ఈ ర్యాలీలో పాల్గొన్నారన్నారు. ఈ మహిళా బైకర్స్ స్ఫూర్తితో మహిళలు సమాజంలో పురుషులకు దీటుగా ఎదగాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా గోల్కొండ కోటలో మహిళా రైడర్స్‌ను ఉత్తేజపరచడానికి మిలట్రీ బ్యాండ్ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించింది.



గోల్కొండ కోటలో మహిళా బైకర్లు

పాతబస్తీలో మజ్లిస్ పార్టీకి దీటుగా కాంగ్రెస్

చార్మినార్: పాతబస్తీలో మజ్లిస్ పార్టీకి దీటుగా కాంగ్రెస్ పార్టీ మాత్రమే పోటీలో నిలబడగలదని గ్రేటర్ కాంగ్రెస్ కమిటీ ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు కాశమోనీ శ్యాంరావు ముదిరాజ్ అన్నారు. బహదూర్‌పురా నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఎంపికైన దూద్‌బౌలీకి చెందిన పులిపాటి రాజేశ్‌కుమార్‌ను సోమవారం ఆయన అభినందనలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఈసారి తమ పార్టీ అభ్యర్థులు ఆశించిన ఫలితాలు సాధిస్తారన్నారు.



రాజేశ్‌కుమార్‌కు అభినందనలు తెలియజేస్తున్న కాశమోనీ శ్యాంరావు ముదిరాజ్

'రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ టికెట్లు అమ్ముకున్నాడు'

నాంపల్లి: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి గద్వాల్ టికెట్‌ను అమ్ముకున్నాడంటూ టీపీసీసీ కార్యదర్శి డాక్టర్ కురువ విజయ్ కుమార్ ఆరోపించారు. సోమవారం గన్‌పార్కు ఎదుట తన అనుచరులతో కలిసి నల్ల కండువాలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో 65 సీట్లను రూ.600 కోట్లకు విక్రయించారని ఆరోపించారు. గద్వాల్ టికెట్‌ను విక్రయించి రూ.10 కోట్లు నగదు, ఐదెకరాల భూమిని పొందారని ధ్వజమెత్తారు. రేవంత్‌రెడ్డి టికెట్లు అమ్ముకోలేదని భావిస్తే జూబ్లీహిల్స్‌లోని పెద్దమ్మ గుడి వద్దకు తన మనువడితో వచ్చి ప్రమాణం చేయాలని సవాల్ విసిరారు. ఉద్యమకారులకు స్థానం లేని కాంగ్రెస్ తొలి జాబితాను పూర్తిగా రద్దు చేయాలని, ఈ జాబితాపై విచారణ చేపట్టి మళ్లీ కొత్త జాబితాను ప్రకటించాలని కోరారు.

'అన్ని స్థానాల్లో పోటీ చేస్తాం'

గన్‌ఫౌండ్రీ: రాబోయే ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేయనున్నట్లు ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ విభాగం జాతీయ అధ్యక్షుడు బిషప్ దాసన్న ప్రకటించారు. సోమవారం గన్‌ఫౌండ్రీలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు కేబీ శ్రీధర్‌తో కలిసి వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కుల మతాలకు అతీతంగా అన్ని వర్గాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. మరో రెండు రోజుల్లో అభ్యర్థులను ప్రకటించనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో నేషనల్ పీపుల్స్ ఫ్రంట్ కన్వీనర్ సీహెచ్. బాలకృష్ణ, పార్టీ నాయకులు ఉదయలక్ష్మి, మోహన్ గాంధీ, వాసుదేవారావు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బిషప్ దాసన్న

భారతీయ సంస్కృతిని అలవర్చుకోవాలి

సుల్తాన్‌బజార్: చిన్నారులు చదువులతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను అలవర్చుకోవాలని మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలచారి అన్నారు. విజయ మాధవి సాంస్కృతిక అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో నవరాత్రి మహోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ సందర్భంగా వివిధ కళారూపాలలో నృత్యాలు ప్రదర్శించిన చిన్నారులకు అవార్డులు, సర్టిఫికెట్లు అందజేశారు.

వినీతజైన్‌కు బంగారు పతకం



వినీతజైన్‌ను సత్కరిస్తున్న రేఖా ఈటూరి తదితరులు

సుల్తాన్‌బజార్: వరల్డ్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో నగరానికి చెందిన వినీత జైన్ 67.5 కిలోల బరువు విభాగంలో గోల్డ్ మెడల్ గెల్చుకుందని అధ్యక్షురాలు రేఖ ఈటూరి తెలిపారు. బెంగళూర్‌లో జరిగిన ఈ చాంపియన్‌షిప్‌లో వినీత జైన్ గోల్డ్ మెడల్ సాధించుకుని మొదటిస్థానంలో నిలవడంపై సర్వత్ర హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా చాంపియన్‌షిప్ అధ్యక్షురాలు రేఖా ఈటూరి, కార్యదర్శి మునిం పుల్లెలలు వినీతాజీ బంగారు పతకం సర్టిఫికెట్లతో సత్కరించారు. నవంబర్ 2002లో కజకిస్థాన్‌లో జరిగే అంతర్జాతీయ చాంపియన్‌షిప్‌లో పాల్గొన్నట్లు తెలిపారు.